

# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 25, జూన్ 2026


# బాసర మహంకాళి ఆలయంలో చోరీ

- వెండి కిరీటం హుండీలోని డబ్బు అపహరణ
- ఆలయంలో పటిష్ట బద్ధత ఏర్పాటుపై ప్రత్యేక చర్య ఎస్పీ జానకి షర్మిల
- దుండగుల కోసం ప్రత్యేక బృందాల గాలింపు
- ఆరుగురి హోంగార్డులపై వేటు





**దిలావర్‌పూర్, జూన్ 24, ప్రభాతవార్త:**

దక్షిణ భారతదేశంలోనే పుణ్యక్షేత్రమైన నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పరిధిలో ఉన్న మహంకాళి ఆలయంలో మంగళవారం తెల్లవారు జామున చోరీ జరిగిన విషయం తెలిసిందే. గుర్తుతెలియని దుండగులు ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటంతో పాటు హుండీని అపహరించినట్లు సమాచారం. హుండీని తీసుకెళ్లిన దుండగులు అందులోని నగదును కాజేసి, అనంతరం ఖాళీ హుండీని వ్యాస గుడి సమీపంలో వదిలివెళ్లినట్లు గుర్తించారు. ఉదయం నిత్యపూజల కోసం ఆలయానికి వచ్చిన అర్చకులు చోరీ జరిగిన విషయాన్ని గమనించి ఆలయ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఘటనాస్థలాన్ని స్వయంగా పరిశీలించి పరిస్థితులను తెలుసుకున్నారు. క్లూస్ టీం సేకరించిన ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్‌లను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తూ దుండగులను త్వరలోనే గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. ఈ ఘటన నేపథ్యంలో ఆలయ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు, ఆలయ ప్రాంగణంతో పాటు భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘాను మరింత పటిష్టం చేయాలని నిర్ణయించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మిగతా 2లో..

### ప్రతి సంక్షేమ పథకం పేదలందరికీ చేరాలన్నదే

# ప్రభుత్వ ఆకాంక్ష

* ప్రత్యేక అధికారి ఇలంబర్తి



**నిర్మల్, జూన్ 24, ప్రభాతవార్త:**

ప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రతి సంక్షేమ పథకం క్షేత్రస్థాయిలో పేదలందరికీ చేరాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఆకాంక్ష అని "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" సమీక్ష ప్రత్యేక అధికారి ఇలంబర్తి అన్నారు. బుధవారం నిర్మల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుముందు, 99 రోజుల ప్రణాళికలో శాఖల వారీగా చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటో గ్యాలరీని కలెక్టర్, అధికారులతో కలిసి ఆయన తిలకించారు. అనంతరం శాఖల వారీగా చేపట్టిన ప్రగతి కార్యక్రమాల వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి ఇలంబర్తి మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో 99 రోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అట్టడుగు వర్గాల ప్రజలకు చేరేలా కృషి చేయాలన్నారు. స్పష్టమైన ప్రణాళికతో ప్రజాపాలనను విజయవంతం చేసిన అధికారులకు శుభాకాంక్షలు తెలుపుతూ, నివేదికలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పోలీసు శాఖ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల వల్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని, అధికారులు మరిన్ని ఇన్నోవేటివ్ ఆలోచనలతో

మిగతా 2లో..

### పల్స్ పోలియో కార్యక్రమాన్ని

# విజయవంతం చేయాలి

జిల్లా వైద్యాధికారి - మందమర్రి పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్

**మందమర్రి, జూన్ 24, ప్రభాతవార్త**

ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. బుధవారం మందమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ, ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 76,367 మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో వ్యాక్సిన్ అందించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 459 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి, 1,836 మంది వైద్య సిబ్బందిని విధుల్లో నియమించినట్లు వెల్లడించారు. ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని పిల్లల వివరాలను ముందుగానే సేకరించి, మొదటి రోజే వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. మిగిలిపోయిన పిల్లలకు జూన్ 29, 30 తేదీలలో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. అప్పుడే పుట్టిన పిల్లలు, జ్వరం లేదా జలుబుతో బాధపడుతున్న పిల్లలు కూడా పోలియో చుక్కలు వేసుకోవచ్చని తెలిపారు. అనంతరం జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, అసంక్రమణ వ్యాధుల నియంత్రణ, ఔషధాల నిల్వలను పరిశీలించారు. అత్యవసర మందులు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని, మిగతా 2లో..



# సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్, జూన్ 24, ప్రభాతవార్త :**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి కార్యాలయ ఉద్యోగుల హాజరు, సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి నిర్వహించే సర్ ఇంటింటి కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. సర్ కార్యక్రమం సర్వే పత్రాలను పంచాయతీల వారీగా, పోలింగ్ కేంద్రాల వారీగా పంపిణీ చేయాలని, ఓటరు జాబితాలో ఓటర్ల నూతన మిగతా 2లో..



## ప్రతి సంక్షేమ పథకం పేదలందరికీ చేరాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష

(మొదటిపేజీ తరువాయి)

ముందుకు సాగాలని సూచించారు.

### సమిష్టి కృషితోనే ప్రజాపాలన విజయవంతం: జిల్లా కలెక్టర్

ప్రజలు, ప్రజాప్రతినిధుల సమిష్టి భాగస్వామ్యం, అధికారుల కృషితోనే జిల్లాలో "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ఈ ప్రత్యేక ప్రణాళికలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు, గ్రామ, వార్డు సభలు, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, అరైవ్ అలైవ్ కార్యక్రమాలతో పాటు రైతు, మహిళా శిశు సంక్షేమ, విద్యా, ఆరోగ్య, సాంస్కృతిక, పర్యావరణ వారోత్సవాలను విస్తృతంగా నిర్వహించామన్నారు. అధికారులంతా ప్రజల వద్దకే వెళ్లి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించారని వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో పంటల దిగుబడి అధికంగా వచ్చిందని, రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు పూర్తి చేశామన్నారు. భవిష్యత్తు అవసరాల కోసం అదనపు ధాన్యపు గోదాములను నిర్మిస్తామని, రెవెన్యూ అంశాలను తక్షణమే పరిష్కరిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల జీవనోపాధి కోసం పెట్రోల్ బంక్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. గడువు ముగిసిన మందులను ప్రత్యేకంగా భద్రపరచాలని ఆదేశించారు. బీపీ, షుగర్ వంటి అసంక్రమణ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారి వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, పర్యవేక్షకులు, క్షయవ్యాధి నియంత్రణ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

పాస్ ఫోటోల కోసం ఫోటోగ్రాఫర్లతో మాట్లాడి గ్రామాలలో తక్కువ ధరకు ఫాస్ ఫోటోలు అందించేలా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ కు సూచించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారం అందిస్తారని, సంబంధిత ఓటరు ఫోరాలను నింపి ఆ ఫారాలను తిరిగి బూత్ స్థాయి అధికారులు ఇంటికి వచ్చిన సమయంలో సేకరించి ఫారంలో పొందుపరిచిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. తహసిల్దార్లు, సూపర్వైజర్లు, జిల్లా యంత్రాంగం సమగ్ర సవరణ ప్రక్రియను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైనూర్ తహసిల్దార్ ఆడ బిర్షావ్, ఆర్ ఐ మోహన్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

## బాసర మహంకాళి ఆలయంలో చోరీ

(మొదటిపేజీ తరువాయి)

పునరావృతం కాకుండా భద్రతా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు, ఆలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ జానకి షర్మిల విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ నాయకులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో పటిష్ట బద్ధత ఏర్పాటు చేయాలని ఇలాంటి ఘటనలు పునరుద్ధం కాకుండా చూడాలని పలువురు కోరారు.

## నాణ్యమైన విత్తనాలతోనే రైతుకు లాభం

**దిలావర్పూర్, జూన్ 23, ప్రభాతవార్త:**

రైతులు నాణ్యమైన, ప్రభుత్వం సిఫారసు చేసిన విత్తనాలతోనే సాగు చేపట్టాలని వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి సూచించారు. మండలంలోని గుండంపల్లి రైతు వేదికలో బుధవారం నిర్వహించిన విత్తన మేళా సదస్సులో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలంటే విత్తనాల ఎంపికే అత్యంత కీలకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఏడు రకాల సన్న వరి విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని, వాటిని సాగు చేసిన రైతులకు బోనస్ కూడా లభిస్తుందని తెలిపారు. ధృవీకరించిన విత్తనాలను ఉపయోగించడం వల్ల పంటల పెరుగుదల మెరుగ్గా ఉండటంతో పాటు చీడపీడల సమస్యలను సకాలంలో గుర్తించి నివారించవచ్చని వివరించారు. రైతులు అనధికారిక విత్తనాలపై ఆధారపడకుండా వ్యవసాయ శాఖ సూచించిన విత్తనాలను మాత్రమే వినియోగించాలని ఆయన కోరారు. దీంతో దిగుబడులు పెరిగి రైతులకు మంచి ఆదాయం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో గుండంపల్లి గ్రామ సర్పంచ్ రమణారెడ్డి, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొని విత్తనాల ఎంపిక, సాగు పద్ధతులపై అవగాహన పొందారు.

# భూసర్వే ద్వారా సమస్యలకు శాశ్వత పరిష్కారం

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**బెల్లంపల్లి, జూన్ 24, ప్రభాతవార్త**



భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని నెన్నెల మండలం పుప్పల్వానిపేట గ్రామంలో నిర్వహించిన భూ సర్వే అవగాహన సదస్సుకు ఎ.డి.ఎస్.ఎల్.ఆర్. శ్రీనివాస్, మండల తహసిల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి తదితరులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులతో సరిపోల్చి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా భూ సర్వే నిర్వహించి ఆయా భూములకు పన్ను విధించడం జరుగుతుందని చెప్పారు. భూ సర్వేను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, ఒకసారి తప్పు జరిగితే సవరించడానికి ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు. పట్టాదారులు తమ భూముల హద్దులను స్పష్టంగా నిర్ధారించుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియలో దరఖాస్తుదారులు సరైన పత్రాలతో పాల్గొనాలని, అర్హులైన వారికి మాత్రమే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. బోగస్ దరఖాస్తులను రద్దు చేయడం జరుగుతుందని, వివాదాస్పద భూములను న్యాయబద్ధంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వే సమగ్రంగా జరిగితే భవిష్యత్తులో భూ వివాదాలకు తావు ఉండదని అన్నారు. అంతకుముందు మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, అధికారులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి విధుల్లో సమయపాలన పాటించాలని సూచించారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. తదనంతరం మండలంలోని కొన్నంపేట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, అలాగే మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై దృష్టి సారిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాసర ఆలయంలో భద్రతను పెంచాలి

**- అధికారులు స్పందించకుంటే నిరాహార దీక్షకు సిద్ధం**

**- బీజేపీ మండల అధ్యక్షుడు పుట్నాల సాయినాథ్ పటేల్**

**భైంసా, జూన్ 24, ప్రభాతవార్త:**

బాసర క్షేత్రంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన దొంగతనం ఘటనపై బాసర మండల బీజేపీ అధ్యక్షుడు పుట్నాల సాయినాథ్ పటేల్ తీవ్రంగా స్పందించారు. చోరీకి పాల్పడిన నిందితులను త్వరితగతిన పట్టుకుని చట్టం ముందు ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బాసర ఆలయ పరిధిలో అడుగడుగునా సుమారు 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న హోంగార్డులందరినీ బదిలీ చేసి వారి స్థానంలో కానిస్టేబుల్ స్థాయి పోలీసు ఉద్యోగులను నియమించాలని కోరారు. అలాగే కంట్రోల్ రూమ్‌లో 24 గంటల పాటు ముగ్గురు సిబ్బందితో ప్రత్యేక నిఘా ఉంచాలని డిమాండ్ చేశారు. ఆలయ భద్రతతో పాటు గోదావరి నది వద్ద భక్తుల ప్రాణాలకు హాని కలగకుండా 24 గంటలు గజ ఈతగాళ్ల పర్యవేక్షణ ఉంచాలని, రెస్క్యూ బోట్లతో పాటు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని నియమించాలని కోరారు. ప్రమాదాలు జరగకుండా నది ఘాట్ల వద్ద స్నానాల కోసం భక్తులకు ఒకే ఘాట్ వద్ద అనుమతినివ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 4వ తేదీ లోపు ఆలయ అధికారులు, యంత్రాంగం ఈ డిమాండ్లపై స్పందించకపోతే ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ సూచనల మేరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన మెట్ల వద్ద నిరాహార దీక్షకు సిద్ధమవుతానని సాయినాథ్ పటేల్ హెచ్చరించారు.

## నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తోన్న ఇందిరమ్మ ఇళ్ల పథకం

**బెల్లంపల్లి, జూన్ 24, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు శాశ్వత నివాస గృహాలు అందిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నెన్నెల్ మండలంలోని మైలారం గ్రామపంచాయతీ పరిధిలో లబ్ధిదారులు కొమ్ము రాజక్క, జంపం లక్ష్మి గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి హాజరై కొత్త ఇంటిలో ప్రవేశించిన కుటుంబాలకు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఇళ్లులేని ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గురునాథం మల్లగౌడ్, తోట శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెన్నూరి శంకర్, గోలెటి సంధ్య, సింగతి తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ము రాజన్న, ఓబీసీ కోచైర్మన్ బండి లక్ష్ముమ్మణ్, యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత చెన్నూర్‌గా తీర్చిదిద్దుతాం.!

**- నేరాల నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరం**

**- యువత మత్తుకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోకండి**

**- చెన్నూరు పట్టణ సీఐ బాన్సీలాల్**

**చెన్నూరు, జూన్ 24, ప్రభాతవార్త**

మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని యువతకు చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ సూచించారు. మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలో డ్రగ్స్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు, గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టేందుకు పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, అస్నాద్ చౌరస్తా, బస్ స్టాండ్ ఏరియాలలో నార్కోటిక్ డాగ్ టీం తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూర్ పట్టణ సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల నేరాలు సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని, మత్తు పదార్థాల వ్యసనం వల్ల యువత జీవితాలను నాశనం అవుతున్నాయని అన్నారు. డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని, ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయించినా, వినియోగించినట్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన యువతతోనే సమాజం, దేశం అభివృద్ధి సాధ్యమవుతుందని, యువత వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలు, విద్య, నైపుణ్యాభివృద్ధి వైపు దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భావితరాల కోసం ప్రకృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత

**- డా. కొత్తపల్లి అనిత**

**కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గరీబ్ నవాజ్ రిలీఫ్ ఫౌండేషన్ (జిఎన్ఆర్ఎఫ్) ఆధ్వర్యంలో, మహమ్మద్ ఆరిఫ్ అత్తారీ నిర్వహణలో పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ కమిషనర్ బి. తిరుపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా డా. కొత్తపల్లి అనిత మాట్లాడుతూ, భావి తరాలకు మనం అందించగలిగే అత్యంత విలువైన ఆస్తి స్వచ్ఛమైన పర్యావరణం. ప్రకృతిని కాపాడుకోవడం అనేది కేవలం ఒకరిద్దరి బాధ్యత కాదు, సమాజంలోని ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాలి అని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ బి. తిరుపతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టిన గరీబ్ నవాజ్ రిలీఫ్ ఫౌండేషన్ (జిఎన్ఆర్ఎఫ్) నిర్వాహకులను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, గరీబ్ నవాజ్ రిలీఫ్ ఫౌండేషన్ సభ్యులు, తదతరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన




వేమనపల్లి, జూన్ 26, ప్రభాతవార్త

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వేమనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నీల్వాయి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై వివరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని, మాదకద్రవ్యాలకు బానిస కావడం వల్ల వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. అలాగే బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ, చైల్డ్ ట్రాఫికింగ్ నివారణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, మహిళలు, బాలికల భద్రత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు మరియు శారీరక దృఢత్వాన్ని ప్రోత్సహించేందుకు పాఠశాల విద్యార్థులకు వాలీబాల్ కిట్టు అందజేయడం జరిగింది. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, నైతిక విలువలు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మంచి అలవాట్లను అలవరచుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వుప్పులపు సాయికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎం.ఏ. లతీఫ్ మహా పాదయాత్రకు మూడేళ్లు..

భైంసా, జూన్ 24, ప్రభాతవార్త:



ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మంచిర్యాల జిల్లా అబ్జర్వర్ ఎంఏ లతీఫ్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా 2023 జూన్ 25న ప్రారంభించిన మహా పాదయాత్ర విజయవంతంగా మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుంటోంది. ఈ సందర్భంగా గురువారం భైంసా పట్టణంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 8:00 గంటలకు భైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 9:00 గంటలకు భైంసాలోని ఐబీ గెస్ట్ హౌస్‌లో ఎంఏ లతీఫ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు. ఈ మీడియా సమావేశంలో మహా పాదయాత్ర మూడేళ్ల ప్రస్థానం, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన కార్యక్రమాలు, నియోజకవర్గ అభివృద్ధి అంశాలు, పార్టీ బలోపేతానికి సంబంధించిన విషయాలపై ఆయన మాట్లాడనున్నారు. ఈ కార్యక్రమాలకు ముధోల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంఏ లతీఫ్ టీమ్ ఒక ప్రకటనలో కోరింది.

## అగ్నివీర్ ఉద్యోగి సబ్లె సురేందర్‌ను అభినందించిన ఎమ్మెల్యే

నేరడిగొండ, ప్రభాతవార్త:



నేరడిగొండ మండలంలోని లింగట్ల గ్రామానికి చెందిన సబ్లె సురేందర్ ఇటీవలే వెలువడిన అగ్నివీర్ ఫలితాల్లో దేశ సేవ చేసే సువర్ణావకాశాన్ని, ఉద్యోగాన్ని సాధించారు. ఈ సందర్భంగా బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆయనను ప్రత్యేకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. సురేందర్‌కు మిఠాయిలు తినిపించి, శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించారు. కష్టపడి చదివి, శారీరక దారుఢ్య పరీక్షల్లో రాణించి అగ్నివీర్‌గా ఎంపికవడం గ్రామానికి, నియోజకవర్గానికి గర్వకారణమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా కొనియాడారు. యువత సురేందర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో మిఠాయి దుకాణాలపై ఫుడ్ సేఫ్టీ అధికారుల మెరుపు దాడులు

**- గడువు ముగిసిన పదార్థాలు స్వాధీనం**

నిర్మల్, ప్రభాతవార్త:



తినుబండారాల దుకాణదారులంతా ఆహార భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి టి. సునీత స్పష్టం చేశారు. నిర్మల్ పట్టణంలోని పలు మిఠాయి దుకాణాలపై మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో పలు దుకాణాల్లో గడువు తీరిన మిఠాయిలు, చాక్లెట్లు లభ్యమయ్యాయి. అంతేకాకుండా, తయారీ తేదీ, గడువు తేదీ, ఎంఆర్‌పీ వంటి వివరాలు లేకుండా విక్రయిస్తున్న లేబుళ్ల లేని ఆహార పదార్థాలను కూడా అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం, 2006 ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని అధికారి సునీత హెచ్చరించారు. ప్రతి ఆహార పదార్థంపై ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల మేరకు లేబుల్ తప్పనిసరన్నారు. వినియోగదారుల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. దుకాణదారులు ప్రతిరోజూ స్టాక్‌ను పరిశీలించి, గడువు ముగిసిన పదార్థాలను వెంటనే తొలగించాలని సూచించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యాపారులు బాధ్యతగా వ్యవహరించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆమె తెలిపారు.

## అపోహలు వీడి నేత్ర, అవయవ దానానికి ముందుకు రావాలి

**- జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్**

బెల్లంపల్లి, జూన్ 24, ప్రభాతవార్త



ప్రజలందరూ అపోహలు వీడి నేత్ర, అవయవ, శరీర దానానికి ముందుకు రావాలని జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ పిలుపునిచ్చారు. బెల్లంపల్లి పట్టణం శంషీర్‌నగర్ బస్తి వాసి, నేత్రదాత జెడల రమేష్ సంస్మరణ సభను వారి స్వగృహంలో జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జనహిత సభ్యులు రమేష్‌కు నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులు భార్య జెడల పుష్పలత, కుమారులు పవన్, నిచల్, అక్షయ్, తల్లిదండ్రులు రాంబాయిరాములు, సోదరుడు కుమార్ తదితరులను అభినందించి ప్రశంస పత్రం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆడెపు సతీష్ మాట్లాడుతూ పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ ఇద్దరు అంధులకు చూపునివ్వాలనే సంకల్పంతో నేత్రదానం చేయడం జెడల రమేష్ కుటుంబ సభ్యుల మహత్తర నిర్ణయమని కొనియాడారు. జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఇది 21వ నేత్రదాన కార్యక్రమమని తెలిపారు. నేత్రదానం చేసినప్పుడు మరణానంతరం ఎనిమిది గంటలలోపు కళ్లలోని కార్నియా పొరను సేకరించి ఇద్దరికి చూపు ప్రసాదించే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే బ్రెయిన్ డెడ్ అయినప్పుడు అవయవ దానం ద్వారా ఆరుగురి ప్రాణాలను కాపాడవచ్చని, శరీర దానం ద్వారా వైద్య విద్యార్థుల అభ్యాసానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమాజానికి ఉపయోగపడేలా ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి గౌరవ సలహాదారులు పూదరి నగేష్ గౌడ్, సహాయ కార్యదర్శి గొడిసెల శేఖర్, కార్యవర్గ సభ్యులు దేవసాని వెంకటేశ్వర్లు, డోలి సుకుమార్, నిచ్చకొల గురుస్వామి, భీమిని కనకయ్యతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, బస్తి వాసులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జ్ రాం కిషన్ రెడ్డి

## బాధిత కుటుంబాలను పరామర్శించిన బీఆర్ఎస్ జిల్లా ఇన్‌ఛార్జ్ రాంకిషన్‌రెడ్డి

సారంగాపూర్, జూన్ 24, ప్రభాతవార్త:

సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మరణించిన బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా ఇన్‌ఛార్జ్ రాం కిషన్ రెడ్డి బుధవారం పరామర్శించారు. మండలంలోని ప్యారమూర్ గ్రామానికి చెందిన వసంత అనే మహిళ మూడు రోజుల క్రితం పని నిమిత్తం వెళ్తుండగా.. బీరవెల్లి, కాల్వ గ్రామాల మధ్య ఆటో, బైక్ ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో మరణించారు. ప్యారమూర్ గ్రామానికి వెళ్లిన రాం కిషన్ రెడ్డి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం వైకుంఠాపూర్ గ్రామానికి చెందిన లగ్గం జగదీష్ ఇటీవల దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా.. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ఆర్థిక సహాయాన్ని అందించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా వైకుంఠాపూర్ గ్రామానికి చెందిన ఏరిండ్ల చిన్నయ్య, మర్రి లాస్మవ్వలు కూడా వేర్వేరు కారణాలతో మరణించడంతో ఆయా కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. అన్ని రకాలుగా బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కన్వీనర్ దేవి శంకర్, లక్ష్మణచాంద మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, నిర్మల్ మండల కన్వీనర్ మహేష్ రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, మోతివారి లక్ష్మణ్, ప్యారమూరు రవి, లక్ష్మణ్, నరేష్, గంగయ్య, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాండ్ర (జి) గ్రామంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం

సారంగాపూర్, జూన్ 24, ప్రభాతవార్త:




సారంగాపూర్ మండలంలోని తాండ్ర(జి) గ్రామంలో బుధవారం పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను, వాటికి దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడం యొక్క ప్రాముఖ్యతను ఈ సందర్భంగా గ్రామస్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ.. నేటి యువతను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలన్నారు. యువత ఎలాంటి దురలవాట్లకు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండ్ర(జి) సర్పంచ్ వెన్నెల నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి రఘు, గ్రామ ప్రముఖులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పారదర్శకమైన ఓటర్ల జాబితా సర్ లక్ష్యం

**- బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్**

చెన్నూరు, జూన్ 24, ప్రభాతవార్త

రాష్ట్రంలో పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారు చేయడమే సర్ లక్ష్యమని భాజపా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరు వెంకటేశ్వర గౌడ్ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం కిష్టంపేటలోని బిఎంఆర్ గార్డెన్లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి బీఎల్ఏ 2 వర్క్ షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, సర్ ద్వారా ఏ ఒక్కరి ఓటు కోల్పోయే అవకాశం లేదని, ఓటర్ లిస్టులో ఉన్న లోపాలను ఆధారంగా చేసుకొని కొందరు రెండు మూడు చోట్లలో ఓటర్ లిస్టులో పేర్లు నమోదు చేసుకున్నారని అన్నారు. దశాబ్ద కాలంగా చనిపోయిన వారి ఓట్లు తొలగించిన దాఖలాలు లేవని అవన్నీ సరి చేయడమే సర్ లక్ష్యమని అన్నారు. బిఎల్ఏ 2 లు క్షేత్రస్థాయిలో ఓటర్లకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు అందేలా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 2002లో ఓటర్ లిస్టులో తల్లిదండ్రుల పేర్లు లేని వారు 13 రకాల ఆధారాలతో తమ పేర్లను ఓటర్ లిస్టులో నమోదు చేసుకోవచ్చని, వారు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. ఎన్రోల్మెంట్ ఫామ్ ఎలా నింపాలి, 2002 ఓటర్ లిస్టులో ఎలా మన పేరు చూసుకోవాలి, అనే తదితర అంశాలపై బీఎల్ఏ 2 లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్, సర్ బీజేపీ రాష్ట్ర కోఆర్డినేటర్ హరిబాబు, బిఎల్ఏ 1 జాడి తిరుపతి, చెన్నూరు మండల అధ్యక్షులు బుర్ర రాజశేఖర్, జిల్లా కార్యదర్శి రత్న లక్ష్మీనారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు వి.దీక్షితులు, దేవరనేని సంజీవరావు, మల్యాల రాజమల్లు, మండల పార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు.

# డిమాండ్లు పరిష్కరించాలని సింగరేణి అధికారుల నల్లబ్యాడ్జీల నిరసన

**నస్పూర్, జూన్ 24, ప్రభాతవార్త**

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సింగరేణి అధికారుల నిరసన కార్యక్రమాలు ఉధృతమవుతున్నాయి. ఈ నెల 19న శ్రీరాంపూర్ ఏరియాతో పాటు సింగరేణిలోని అన్ని రీజియన్లలో భారీ ర్యాలీలు నిర్వహించినప్పటికీ యాజమాన్యం నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో బుధవారం అధికారులు మరోసారి ఆందోళనకు దిగారు. ఉదయం నుండి అధికారులు అందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం సాయంత్రం వేళ జీఎం కార్యాలయ ప్రాంగణంలో చేరి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. సీఎంఓఏఐ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు లక్కాకుల మహేష్ నాయకత్వంలో అధికారులు జీఎం కార్యాలయ వేదిక వద్ద తమ డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. అధికారులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా స్పందించకపోతే వచ్చే సోమవారం నుండి నిరాహార దీక్షలు చేపట్టడానికి సైతం వెనుకాడబోమని వారు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఎంఓఏఐ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ సెక్రటరీ మల్లయ్య, జాయింట్ సెక్రటరీ భీమన్న, ట్రెజరర్ పద్మలతో పాటు శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాలకు చెందిన అధికారులు, మహిళా అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





ఆసనాలు చేస్తున్న క్లబ్ సభ్యులు, విద్యార్థులు

## యోగను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో అలవాటు చేసుకోవాలి

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 24, ప్రభాతవార్త :**

యోగను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో అలవాటు చేసుకోవాలని వాసవి క్లబ్ అధ్యక్షుడు మర్యాల ఉదయ్ బాబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక పిల్లల పార్కులో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో యోగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, నిత్య జీవితంలో యోగను భాగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత కాలంలో ఒత్తిడి, అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవడంలో యోగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. యోగ ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. యోగ ద్వారా ఏకాగ్రత పెరగడంతో పాటు శరీరానికి ఉత్సాహం, మనసుకు ప్రశాంతత లభిస్తుందని వివరించారు. అనంతరం యోగ గురువు గణేష్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## బారెగూడలో ఘనంగా పీరీల ఊరేగింపు

**కాగజ్‌నగర్, జూన్ 24, ప్రభాతవార్త**



కాగజ్‌నగర్ మండలం బారెగూడ గ్రామంలోని హుస్సేన్ హుస్సేన్ ఆశిర్ ఖానాలో మొహర్రం ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని పీరీలను డప్పు వాయిద్యాల నడుమ సవారీ నృత్యాలతో ఘనంగా ఊరేగించారు. గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, గురువారం నిర్వహించే పెద్ద సరిగెత్తు కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని కోరారు. మొక్కులు చెల్లించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలిరానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మల్లేష్, నందయ్య, మెంగాజీ, గ్రామ పటేల్ గజినీతో పాటు గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## చింతగూడలో రూ.10 లక్షల సిమెంట్ రోడ్డు పనులకు ఎమ్మెల్సీ దండే విఠల్ శంకుస్థాపన

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 24, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామంలో గ్రామాభివృద్ధికి మరో అడుగు పడింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ సహకారంతో మంజూరైన రూ.10 లక్షల సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లెందుగురే శ్యాంరావు, చింతగూడ ఉపసర్పంచ్ ఆత్రం ఆకాష్, వార్డు సభ్యులు పార్వతి, సాయి ప్రకాష్, సెండే సాగర్, మోర్లె భీంరావు, అడే శ్రీనివాస్, అడే రాజు, విజయ్ కామ్రే, లెందుగురే గోపి, సుంకి అశోక్, దుంద్ర ఎంకటి తదితరులు పాల్గొన్నారు.

## అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశం కొరకు దరఖాస్తుల స్వీకరణ

### - కరీంనగర్ ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్

**నస్పూర్, జూన్ 24, ప్రభాతవార్త**

2026-27 విద్యా సంవత్సరానికి గాను కరీంనగర్‌లోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 1వ తరగతి నుండి పదవ తరగతి వరకు ఇంగ్లీష్, 10వ తరగతి తెలుగు మీడియంలలో ప్రవేశం కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయసు 6 నుండి 14 సంవత్సరాల మధ్య ఉండాలని, అంధ బాల బాలికలు ఉత్తర తెలంగాణ రాష్ట్ర నివాసులై ఉండాలని, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్ జిల్లాల వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, పాఠశాలలో ఉచిత విద్య, పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫామ్, పాదరక్షలు, వసతి గృహ సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు సదరం, యుడిఐడి దివ్యాంగ ధ్రువపత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బదిలీ సర్టిఫికెట్, 2 పాస్పోర్ట్ సైజు ఫోటోలతో కరీంనగర్ లోని విజయపురి కాలనీ, మల్కాపూర్ రోడ్డులో గల ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో అందించాలని తెలిపారు. ఇతర వివరాలకు 9701190127, 9440338424లలో సంప్రదించవచ్చని తెలిపారు.



## పనులు వేగవంతం చేయాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జూన్ 24, ప్రభాతవార్త**

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేసి ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపట్టిన మరమ్మత్తు పనులను వేగవంతం చేసి త్వరగా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## శివాజీ నగర్ మురికి కాలువ పనులు ప్రారంభం

**తాండూర్, జూన్ 24, ప్రభాతవార్త :**

తాండూర్ మేజర్ గ్రామ పంచాయతి పరిధిలోని శివాజీనగర్ లో బుధవారం మురికి కాలువల నిర్మాణ పనులకు ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ మురికి కాలు నిర్మాణ పనులకు రూ.8 లక్షలు డీఎంఎఫ్టి నిధులు మంజూరయ్యాయనితెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దుర్గ చరణ్, శ్రీధర్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్.ను పారదర్శకంగా నిర్వహించాలి

### - తాండూర్ తహసిల్దార్ జ్యోత్స్న

**తాండూర్, జూన్ 24, ప్రభాతవార్త :**

భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను బిఎల్వో లు పారదర్శకంగా నిర్వహించాలని తాండూర్ తహసిల్దార్ జ్యోత్స్న అన్నారు. తహసిల్ కార్యాలయంలో బుధవారం బిఎల్ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా బిఎల్వో లు ప్రతి ఇంటింటికి వెళ్లి పొరపాట్లు జరగకుండా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటికి వచ్చే బీఎల్ఓ లకు ఓటర్లు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ కల్పన, గిర్దావర్లు పద్మజ, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.



# మహిళల రక్షణే ధ్యేయం...

## వేధింపుల రహిత సమాజమే లక్ష్యం: షి టీమ్ ఎస్ఐ ఉషారాణి - మహిళల భద్రతపై పోలీసుల ప్రత్యేక చైతన్య కార్యక్రమం

**మందమర్రి, జూన్ 24, ప్రభాత వార్త**



మహిళల భద్రత, రక్షణకు తెలంగాణ పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వేధింపుల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యమని మంచిర్యాల జిల్లా షి టీమ్ ఎస్ఐ ఉషారాణి పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్ (డీఐజీ) ఆదేశాలు, మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, ఐపీఎస్ పర్యవేక్షణలో మందమర్రి పట్టణంలోని మహిళా శక్తి భవన్‌లో తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) మండల సమాఖ్య ఉద్యోగులకు షి టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షి టీమ్ సిబ్బంది మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ప్రభుత్వం, పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలు, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాల నివారణ, టీసేఫ్ యాప్, షి టీమ్ సేవలపై సమగ్ర అవగాహన కల్పించారు. మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రామగుండం షి టీమ్ నంబర్ 6303923700, మంచిర్యాల షి టీమ్ నంబర్ 8712659385, డయల్100 లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు సమాచారం అందించాలని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షి టీమ్ సిబ్బంది కానిస్టేబుళ్లు సతీష్, జ్యోతి, మందమర్రి ఏపీఎం చంద్రశేఖర్, సెర్ఫ్ సిబ్బంది, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఘనంగా పి.ఆర్.టి.యు.టి.ఎస్. సభ్యత్వ నమోదు కార్యక్రమం

### - సంఘంలో సభ్యత్వమే ఒక వరం: జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్ పిలుపు

**కోటపల్లి, జూన్ 24, ప్రభాతవార్త**

కోటపల్లి మండల కేంద్రంలో పి.ఆర్.టి.యు.టి.ఎస్. 2026 సభ్యత్వ నమోదు కార్యక్రమం మండల శాఖ ప్రధాన కార్యదర్శి కోమట్ల బాపు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పి.ఆర్.టి.యు.టి.ఎస్. జిల్లా అధ్యక్షులు కొట్టె శంకర్ హాజరై సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పి.ఆర్.టి.యు.టి.ఎస్. సంఘంలో సభ్యత్వం తీసుకోవడాన్ని ఒక వరంగా భావించి, ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంఘ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బిల్లా తిరుపతయ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోటపల్లి ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు యు. తిరుపతి, ప్రాథమిక పాఠశాల కోటపల్లి ప్రధానోపాధ్యాయులు ఇ.సత్తయ్య, ఉపాధ్యాయులు ఇ. శ్రీనివాస్, వై. విజయ, ఎస్. జయలక్ష్మి తదితరులు పాల్గొని 2026 సంవత్సరానికి గానూ సంఘ సభ్యత్వాన్ని స్వీకరించారు.



## పెద్దనపల్లి సర్పంచ్ శరత్ కుమార్‌కు ఘన సన్మానం

**బెల్లంపల్లి, జూన్ 24, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గం పెద్దనపల్లి గ్రామానికి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ కల్వల శరత్ కుమార్‌కు బుధవారం పట్టణంలోని శ్రీ మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ సభ్యులు శరత్ కుమార్‌కు శాలువా కప్పి మర్యాదపూర్వకంగా సత్కరించారు. గ్రామాభివృద్ధి పట్ల అంకితభావంతో పనిచేస్తారని, క్రీడలకు ప్రోత్సాహం అందిస్తారని అకాడమీ సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సన్మాన కార్యక్రమంలో శరత్ కుమార్ మాట్లాడుతూ మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ఈ ప్రాంతంలో యువ క్రీడాకారులకు మంచి శిక్షణ అందిస్తున్నదని ప్రశంసించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు. అకాడమీ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపకులు అల్లం వెంకటేశ్వర్లు, సభ్యులు గౌతం కుమార్, జాడి శేఖర్, జనగామ రాజు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘనపై సీఐటీయూ నుంచి ఐదుగురు నాయకుల బహిష్కరణ

**బెల్లంపల్లి, జూన్ 24, ప్రభాతవార్త**

సీఐటీయూ పని విధానాలు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఐదుగురు నాయకులను జిల్లా కమిటీ నుంచి బహిష్కరించినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అబ్బోజు రమణ, జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ వెల్లడించారు. బుధవారం బెల్లంపల్లిలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అబ్బోజు రమణ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కమిటీ సభ్యులు సంకె రవి, దూలం శ్రీనివాస్, దాసరి రాజేశ్వరి, కాసిపేట రాజేశం, శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు గట్టు మహేందర్ ఇటీవల మరో కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసి, అందులో కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్లు పత్రికల ద్వారా తెలిసిందన్నారు. ఇది సీఐటీయూ నిబంధనలు, పని విధానాలకు పూర్తిగా విరుద్ధమని పేర్కొంటూ, వారిని జిల్లా కమిటీ నుంచి బహిష్కరించినట్లు స్పష్టం చేశారు. ఇకపై వారికి సీఐటీయూతో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఈ విషయాన్ని సీఐటీయూ అనుబంధ యూనియన్లు, కార్మికులు, జిల్లాలోని కార్మిక సంఘాలు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు గమనించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సమ్మక్క, జిల్లా సహాయ కార్యదర్శులు వెంకటస్వామి, భానుమతి, జిల్లా కమిటీ సభ్యులు జి. ప్రకాష్, సి. దేవదాసు, ఏ. లక్ష్ముమ్మణ్, ఏ. మోలాలి, డి. రాజారాం తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ రహదారికి అడ్డంగా పడిన భారీ వృక్షం

### - అర్ధరాత్రి మూడు గంటలపాటు నిలిచిపోయిన వాహనాలు

### - ఎస్సై రాజేందర్ పర్యవేక్షణలో జేసీబీతో చెట్టు తొలగింపు

**చెన్నూరు, జూన్ 24, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా భీమారం మండలంలోని మాంతమ్మ గుడి దగ్గర జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి భారీ వృక్షం జాతీయ రహదారిపై నేలకొరిగింది. దీంతో రహదారిపై మూడు గంటలపాటు వాహనాలు ఎక్కడివక్కడే నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న భీమారం ఎస్సై రాజేందర్ తన సిబ్బందితో కలిసి అర్ధరాత్రి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని, జేసీబీ రప్పించి చెట్టును తొలగించడంతో వాహనాలు కదిలాయి. అర్ధరాత్రి వర్షంలో వచ్చి ట్రాఫిక్ సమస్య తీర్చినందుకు వాహన దారులు ఎస్సై రాజేందర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు అశోక్,రాజశేఖర్, హోమ్ గార్డు రాజయ్య పాల్గొన్నారు.

## త్రిబుల్ ఐటీలో సీటు సాధించిన తాండూర్ విద్యార్థిని

**తాండూర్, జూన్ 24, ప్రభాతవార్త :**

తాండూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థిని ఎనగందుల తేజస్విని ట్రిబుల్ ఐటీలో సీటు సాధించినట్లుమండల విద్యాధికారి, హెచ్ఎం దుర్గం శ్రీనివాస్ తెలిపారు. మార్చిలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో తేజస్విని మండల స్థాయిలో 560 మార్కులతో మొదటి స్థానం సాధించిందన్నారు. విద్యార్థిని తేజస్వినిని హెచ్ఎం, ఉపాధ్యాయులు శాలువులతో సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.



ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థిని తేజస్విని సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

## షంషేర్‌నగర్ ఆరోగ్య కేంద్రంపై డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

**బెల్లంపల్లి, జూన్ 24, ప్రభాతవార్త**



బెల్లంపల్లి పట్టణంలోని షంషేర్‌నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) నరేందర్ రాథోడ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాలానుగుణ వ్యాధుల పరిస్థితి, వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. తనిఖీ సందర్భంగా ఫార్మసీ, ల్యాబ్ విభాగాలను పరిశీలించిన ఆయన సంబంధిత రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. అలాగే ఏఎన్‌సీ రికార్డులు, సికిల్ సెల్, హెచ్‌పీఎల్ నివేదికలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రంలో అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, నివేదికలను సకాలంలో సమర్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు కేంద్రం పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

# జిల్లాలోని ఎస్.సి. న్యాయ శాస్త్ర పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలి

**- మంచిర్యాల జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్**



**నస్పూర్, జూన్ 24, ప్రభాతవార్త**

జిల్లా షెడ్యూలు కులముల అభివృద్ధి శాఖ ద్వారా 2025-26 సంవత్సరానికి జిల్లాలోని షెడ్యూల్ కులములకు చెందిన న్యాయ శాస్త్ర పట్టభద్రులు శిక్షణ భృతి, న్యాయ శాస్త్ర గ్రంథాలు, ఫర్నిచర్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని మంచిర్యాల జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 39 సంవత్సరాల లోపు న్యాయ శాస్త్ర పట్టభద్రులకు 3 సంవత్సరాల పాటు న్యాయ పరిపాలనలో శిక్షణ నిమిత్తం జిల్లాలోని లా అధికారులకు అటాచ్ చేయడం జరుగుతుందని, శిక్షణ కాలంలో నెలకు 3 వేల రూపాయల చొప్పున శిక్షణ భృతి, న్యాయ శాస్త్ర గ్రంథాలు, ఫర్నిచర్ కొనుగోలు నిమిత్తం ఒకసారి 50 వేల రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హత గల న్యాయ శాస్త్ర పట్టభద్రులు ఆన్‌లైన్‌లో EPASS-https://Telanganaepass.cgg.gov.in లో జూలై 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులు భారత్ అసోసియేషన్ లో సభ్యులుగా ఉండాలని, సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంత వాసులకు 1 లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయల ఆదాయం ఉన్నట్లు మీ సేవా ద్వారా జారీ చేయబడిన ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. సంబంధిత దరఖాస్తు, పత్రాలను సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల జిల్లా షెడ్యూల్డ్ కులాల శాఖ కార్యాలయంలో సమర్పించాలని, ఇతర వివరాలకు కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చని తెలిపారు.

## మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

**- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య**

**బజార్‌హత్నూర్, జూన్ 24, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య, మండల కార్యదర్శి కీర్తి రమణ కలిసి ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కల్లెపెల్లి గంగయ్య మాట్లాడుతూ.. మార్కెట్‌లో గ్యాస్ సిలిండర్, కోడిగుడ్లు, పప్పులు, నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరిగిపోయాయని, దీనివల్ల మధ్యాహ్న భోజన వర్కర్లపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా ఒక విద్యార్థికి మెస్ ఛార్జీ కింద 25 రూపాయలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. వంటకు అవసరమైన నిత్యావసర సరుకులను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని కోరారు. అదేవిధంగా ఈ నెల 28న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరగబోయే మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ కార్మికుల జిల్లా మహాసభను కార్మికులంతా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు షబానా, లక్ష్మి, నీల, నందిని, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేరడిగొండ పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు

**నేరడిగొండ, జూన్ 24, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలు, రోగుల హాజరు పట్టికలు, మందుల నిల్వలకు సంబంధించిన రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడిన ప్రత్యేక అధికారి.. విధుల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆసుపత్రికి వచ్చే బాధితులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో స్థానిక వైద్యాధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## ఉన్నత విద్యతోనే విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు

**హాజీపూర్, జూన్ 24, ప్రభాతవార్త**



రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రోజున దొనబండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సబ్బెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు రఘునాథ్ రావు స్కూల్ కిట్స్ (బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్) అందించారు. ఈ సందర్భంగా రఘునాథ్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం విద్యార్థులకు తమ వంతు సహాయంగా ఈ స్కూల్ కిట్స్ అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులుచదువుతున్నారని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి పీఎం శ్రీ పథకం ద్వారా పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. విద్యార్థులు ఏకాగ్రత తో చదివి తమ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దొనబండ సర్పంచ్ బేతు రమాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ రాజకీయ శిక్షణ శిబిరాలు విజయవంతం చేయండి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 24, ప్రభాతవార్త**



తాండూరు మండలం ఐబి భగత్ సింగ్ కార్యాలయంలో బుధ వారం రోజున సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం కొండు బానేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పాల్గొని మాట్లాడారు. దేశం, ప్రపంచంలో ప్రస్తుత ఆర్థిక సంక్షోభ పరిస్థితులు, రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన పెంపొందించేందుకు జూన్ 28 నుండి 30 వరకు మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయ శిక్షణ శిబిరాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ మూడు రోజుల రాజకీయ శిక్షణ తరగతులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం కునంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపెల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవెన శంకర్ తదితరులు బోధకులుగా హాజరుకానున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దాగాం మల్లేష్, మండల కార్యదర్శి కొండు బానేష్, జిల్లా సమితి సభ్యులు సాలిగామ సంతోష్, బయ్యా మొగిలి, మాజీ ఎంపీపీ కామెర మల్లయ్య, మండల సహాయ కార్యదర్శి నరాల ప్రహ్లాద్, ఖజాంచి పట్టి శంకర్, వార్డు సభ్యుడు కుర్సింగ తిరుపతి, సిపిఐ నాయకులు కామెర దుర్గయ్య, కొండు సాయి తదితరులు పాల్గొన్నారు.




రైస్ మిల్లులను సీజ్ చేస్తున్న జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు

## గోదాములుగా మార్చబడిన రైస్ మిల్లులు స్వాధీనం

**- జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మ రావు**

**హాజీపూర్,జూన్ 24, ప్రభాతవార్త**

జిల్లాలో స్టేట్ వేర్‌హౌస్ కార్పొరేషన్‌కు గోదాములుగా మార్చి అందించిన రైస్ మిల్లులను స్వాధీన పరుచుకుని సీల్ వేయడం జరిగిందని జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మ రావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్టేట్ వేర్‌హౌస్ కార్పొరేషన్‌కు కేటాయించిన జిల్లాలోని హాజీపూర్ మండలంలో గల రాజరాజేశ్వర మిల్, గోదాము, జయలక్ష్మి మిల్, సాయి మణికంఠ మిల్‌లను మండల తహసీల్దార్ పుష్పలత, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, స్టేట్ వేర్‌హౌస్ కార్పొరేషన్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో ముందస్తుగా స్వాధీన పరచుకొని తాళం వేసి సీల్ వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డుకు అడ్డంగా ఉన్న కరెంట్ పోల్ తొలగింపు

**చెన్నూరు, జూన్ 24, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా స్థానిక చెన్నూరు పట్టణంలోని జగన్నాథ ఆలయం వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న కరెంట్ పోల్‌ను స్థానిక 18వ వార్డు కౌన్సిలర్ ఏతం శివకృష్ణ విద్యుత్ సిబ్బంది సహాయంతో పోల్ ను తొలగించారు. కూరగాయల సంత కావడంతో చాలా రోజులుగా పాదచారులకు అడ్డుగా ఉన్న పోల్ ను తొలగించి సమస్య తీర్చినందుకు వార్డు ప్రజలు శివకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆన్‌లైన్ ముఖాముఖిలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్

**భైంసా, జూన్ 24, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమంలో ముధోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ నియోజకవర్గాల సమన్వయకర్త మీనాక్షినటరాజన్ కలిసి స్కైప్ ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా రాష్ట్రంలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ ఆన్‌లైన్ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న బోస్లే నారాయణరావు పటేల్.. ముధోల్ నియోజకవర్గ పరిధిలోని పలు కీలక అంశాలను పంచుకున్నారు. రాష్ట్రంలో ఇంకా ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాలి, ఇప్పటివరకు నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి పనుల ప్రగతి ఏమిటి, ప్రజలకు సంక్షేమ పథకాలు, సౌకర్యాలు ఎలా అందుతున్నాయి అనే అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గాల అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి ప్రభుత్వం, పార్టీ పరంగా తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేశారు.

